# అవిశ్రాంత విశ్రాంతి

ఈ మధ్య శాంతకి భర్త రామాన్ని చూస్తుంటే చాలా కోపం, అసూయ కూడా కలుగుతోంది. కలగదు మరీ! హాయిగా వి.ఆర్.ఎస్. తీసుకుని, టైమయింది, టైమయింది అని పరుగులు పెట్టే గొడవకి స్వస్తి చెప్పి, ఈజీ ఛైర్‌లో పడుకుని విశ్రాంతిగా రోజులు గడిపేస్తున్నాడు రామం. కుక్క పిల్ల కాళ్ల దగ్గర, దాన్ని ఆడిస్తూ రామం - శాంత ఒళ్లు భగభగ మండి పోయింది. ఇంత కాలం ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నా, ఒక్క పని కల్పించుకోకుండా మగ మహారాజల్లే గడిపేసాడు కాలం. ఇప్పుడు ముందే ఉద్యోగ విశ్రాంతి లభించింది కదా! కాస్త సాయం చేయొచ్చుగా భార్యకి, వంటింట్లోకొచ్చి కాఫీ గ్లాసు తీసికెళ్ళొచ్చుగా, ముఖాన పట్టిన చెమట తుడుచుకుంది వంటింట్లో పనిలో ఉన్న శాంత... గడియారం ఎదురుగా టైము చూపిస్తోంది.

"శాంతా, పేపరు అబ్బాయి బిల్లు కోసం వచ్చాడు. ఎంత సేపు నిలబెడతావ్" అన్నాడు రామం, సిగరెట్టు పొడి యాష్‌ట్రేలో దులిపి.

శాంత వినీ వినిపించుకోలేదు. 'మీరు లేచి ఇవ్వండి' అందామనుకుని, ఊరుకుంది... ఇక నుంచి ఈ చిన్నా పెద్ద పనులన్నీ ఆయనకే అప్పగిస్తా' అనుకుంటూ చీర కుచ్చెళ్ళు సర్దుకుని చెతికి వాచీ పెట్టుకుంది.

బస్సులో కూచుంది. ఎన్ని స్టాపులో! అబ్బ!! చాలా చిరాగ్గా వుంది శాంతకి... ఆఫీసుకి వెళ్ళాలనిపించ లేదు ఎందుకో!! బస్సు దిగి ఆటోలో ఇంటికొచ్చేసింది శాంత.

ముందు గదిలో క్రికెట్ ఆట టి.వి.లో చూస్తూ కూచున్న భర్త రామం శాంత ఇంట్లోకి రావటం కూడా గమనించ లేదు.

టిఫిన్ బాక్సు వంటింట్లో పెట్టి, గదిలో మంచం మీద వాలిపోయిన శాంతకి ఓ క్షణంలో మనసులో కొత్త ఆలోచన పాదరసంలా పాకింది!! తనూ ఇరవైఏళ్ళ పైగా పనిచేస్తోంది. తనూ తీసుకోవచ్చుగా వి.ఆర్.ఎస్. ఆ ఆలోచనే గొప్ప ఆనందాన్ని కలిగించింది.

తను, భర్త ఇక హాయిగా సినిమాలకి, ఊళ్ళకి, స్నేహితుల ఇళ్ళకి వెళ్ళి సరదాగా కాలం గడపొచ్చు. సెలవలు లెక్కపెట్టుకుంటూ, పొదుపుగా సెలవలు వాడు కొనక్కర్లేదు. తనూ ఇంట్లో కూచుని క్రికెట్ చూడొచ్చు ఏ శుభముహూర్తాన ఈ ఆలోచన ఎందుకొచ్చిందో, అన్నీ మన మంచికేనని చెప్తారు. అది ఇదే. ఆఫీసుకి బయల్దేరి, వెనక్కి తిరిగి ఎప్పుడైనా వచ్చిందా. అంటే తనకి ఇక విశ్రాంతి తీసుకునే టైమొచ్చింది. అందుకే దేవుడు ఈ బుద్ధి పుట్టించాడు. ఇలా సంతోషంగా అనుకుంటూ, ఎదురుగా కేలండరులో వున్న దేవుడికి దణ్ణం పెట్టింది శాంత.

భర్తకి ఇప్పుడే చెప్పాలా వద్దా అని ఆలోచించాక, చెప్పాలి, అయినా రహస్యమేమిటో, ఆయన ఆనందిస్తాడు. భార్య పరుగులు, కోపాలు లేకుండా ఇంట్లో వుంటుందంటే ఏ భర్త మాత్రం సంతోషించడూ!!

భోజనం అయి పేపరు మళ్ళీ తిరగేస్తున్న భర్త పక్కగా కుర్చీ జరుపుకు కూచుంది శాంత.

'ఇవాళ ఆఫీసు...! ఏదో అన్నాడు అనీ అననట్లుగా రామం.

'ఆఫీసు లేదు గీఫీసు లేదు ఇంకా'

'అంటే'

నేనూ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంటున్నా... 'చాలా ఉత్సాహంగా శాంత చెప్తూంటే, రామం ముఖం చిరాగ్గ పెట్టాడు. అలవాటయి పోయిన ఉద్యోగం అలవాటయి పోయిన టైం, ఇవి ఆరోగ్యంగా, ఆనందంగా ఉంచుతున్నాయి భార్యని... ఇప్పుడు ఊరికే ఇంట్లో కూచోగలదా. వంట రోజూ చేస్తున్నదేగా... ఇక నిద్ర ఎంత సేపు పోతుందీ. భార్య భర్త లిద్దరూ ఇంట్లోనే ఉంటే, ఇక ఏదో అనవసర విషయాలకి తగవులాడుకోటం తప్ప రామం శాంత వంక చూస్తూ "ఇప్పుడే రిటైరయి ఏం చేస్తావ్' అన్నాడు చిరాగ్గా.

"మీరేం చేస్తున్నారూ అదే' శాంత అంది కానీ ఒక్క నిముషంలో కోపం కళ్ళ నిండా నిండింది. భర్త చాలా ఆనందపడిపోయి, రేపే తీసేసుకో, ఊటీ బెంగుళూరు... అలా అలా తిరిగొద్దాం హాయిగా అంటాడని, ఇంత కాలం పాపం, చాలా కష్టపడ్డావులే, ఇంక చాలు, అబ్బాయి దగ్గరికి ఇద్దరం వెళ్ళివద్దాం అని అంటాడని, నువ్వు ఇంట్లో ఉంటే నాకెంతో బావుంటుంది తెలుసా... రోజు ఒక్కణ్ణి అన్నం పెట్టుకు తినలేక బోర్‌గా ఉందని అంటాడని ఆశించిన శాంత ఓ క్షణం అవాక్కయింది.

ఇవేవీ మనసుకి పట్టని రామం,

"నేను నిజంగా చెప్తున్నా. నువ్వు ఇప్పుడే ఉద్యోగం మానేసి ఇంట్లో కూచుంటే, నీళ్ళలోంచి బయట పడ్డ చేపలాగా గిలగిల కొట్టుకుంటావ్. చక్కగా కాటన్ చీర అందంగా కట్టుకుని టిఫిన్ బాక్సును రకరకాలుగా నింపుకుని, స్నేహితురాళ్ళతో బస్సులో వెళ్ళి, వచ్చే నీవు ఇంట్లో ఊరికే కూచోగలవా. నేనెందుకు చెప్తున్నానో విని, ఆ ఆలోచన మానేయ్' అన్నాడు.

'ఏం, మీరు రిటైరయితే హాయిగానే ఉందిగ' అంది శాంత.

"నేను మగాణ్ణి, నలుగురు ఫ్రెండ్సుని ఇంటికి పిలిచి పేకాట ఆడుకోగలను, పొద్దుపేయే వరకు క్లబ్బులో గడిపి రాగలను, ఓ పదిపేపర్లు, ఓ టి.వి. ఛానలు, ఓ ఇంగ్లీషు సినిమా... ఇలా, ఇలా, నాకు రోజు గడవటమేమి కష్టం కాదు, కానీ, నీతో అన్నాడు ఏం చెప్తుందో వినాలని.

'ఏం నేనూ, గడిపేయ గలను - నా చీరలన్నిటికీ నేనే గంజిపెట్టి ఇస్త్రీ చేసుకుని' రామం ఫక్కున నవ్వి, 'ఎక్కడికి కట్టు కెడతావ్...' అన్నాడు శాంత వినిపించుకోకుండా.

'నేనూ స్నేహితులిళ్ళకెళ్లి...

రామం మళ్ళా నవ్వి, 'నీ స్నేహితులంతా ఉద్యోగస్తులేగా, ఎవరుంటారు ఇంట్లో నీతో కబుర్లు చెప్పటానికీ అన్నాడు. శాంత వినిపించు కోకుండా.

'నేనూ మీతో క్లబ్బు కొస్తానూ... ఇద్దరం పేకాట ఆడి, గెలిచి, ఇంటి కొద్దాం' భర్త వంక క్రీగంట చూస్తూ అంది.

శాంత మాటకి ఉలిక్కిపడ్డాడు రామం.

రామం ఎన్నడో ఎవరో చెప్పగా, భర్తలు ఆఫీసు కెళ్ళగానే భార్యలందరూ ఒక చోట చేరి పేకాట డబ్బు పెట్టి ఆడుకుంటారని, సినిమాలకి, యాత్రలకి వెళతారని, డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తారని... ఇలా, ఇలా...విన్నాడు.

శాంత రామం ఏమంటాడోనని చూస్తోంది.

"శాంతా, నన్నేదో రెచ్చకొట్టాలని మాట్లాడటం కాదు, ఆలోచించుకో... మా చెల్లెలు ఎప్పుడూ అంటుంది, మీ ఇంటికొచ్చి ఓ పదిరోజులుందామంటే, మీరిద్దరూ ఉద్యోగాలని బయటకి పోతారు అని, అలాగే మీ వదిన, చెల్లి కూడా ఇలాగే నిన్ను సాధిస్తారు కదా... అందుకే"

"అంటే వాళ్ళంతా వచ్చి మనింట్లో తినిపోతారని భయమా" అంది శాంత.

రామం నవ్వి "నీ ఇష్టం శాంతా, నువ్వింట్లో వుంటే నాకు చాలా సంతోషం. కానీ అలవాటయిన ఉద్యోగంమాని ఇంట్లో కూచుని, కొత్త సమస్యలు తెచ్చుకుంటావని, నీ మీద ప్రేమ కొద్ది చెప్తున్నదే ఇది" అన్నాడు ప్రేమగా భార్యని దగ్గరకి తీసుకుని.

రామం పడక్కుర్చీలో నిద్రపోతున్నాడు. టి.వి. మోగుతోంది వి.ఆర్.ఎస్ తీసుకుందామనుకుంటున్నా అని ఒకరిద్దరితో అంది.

శాంత చెల్లెలు రాధిక స్కూల్నించి వచ్చింది. రాగానే రాధిక భర్త వెంకట్రావు అన్నాడు. "రాధీ, మీ అక్క విశ్రాంతి సెలవు. అదే వి.ఆర్.ఎస్. తీసుకుంటుందట. ఇవాళ వాళ్ళ ఆఫీసులో పనిచేసే సుధ, అదే ఆ మామయ్య కూతురు, నాకు కూరల మార్కెట్టు దగ్గర కలిసి చెప్పింది' అన్నాడు ఆఫీసు నించి రాగానే.

రాధికకి చాలా సంతోషమేసింది. 'ఎంత మంచి మాట చెప్పారూ అక్కకి ఫోన్ చేస్తా... త్వరగా తీసుకోమని అంది.

'నీ కెందుకంత ఉత్సాహం' అన్నాడు వెంకట్రావ్.

"భలేవారే. మీరేమో నెలరోజులు టూరు వెడుతున్నారా. నేనేమో స్కూలు నించి కాంప్‌కి వెళ్ళాలి, తప్పించుకోటానికి వీల్లేదు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నా. వీణ్ణి అక్క దగ్గర దింపేస్తే, హాయిగా చూసుకుంటుంది" అంది ఎంతో ఉత్సాహంగా రాధిక.

శాంత మనసులో మాట ఒకరి నుంచి ఒకరికి చాలా మందికి చేరింది.

శాంతకి పోస్టులో ఆ రోజు మూడు ఉత్తరాలొచ్చాయి. ఒకటి ఆడబిడ్డ జయ, తనకి ఒంట్లో బాగాలేదని, డాక్టలు నెలరోజులు రెస్టు తీసుకోమన్నాడని, వదినా, నువ్వు రిటైరవుతున్నావని విన్నాను. నాకు కాస్త ధైర్యమొచ్చింది. ఒక్క నెల రోజులు విశ్రాంతిగా నీ దగ్గరుంటాను. కాదనవుగా'.

'కాదనగలదా!' శాంత చేతిలో ఉత్తరం రెపరెప లాడింది. మరోటి తెరిచింది.

"అక్కా కంగ్రాట్స్, హాయిగా రిటైరవుతున్నావుగా - ఎంత అదృష్టమే నీది బాధ్యతలయి పోయాయి నీకు వాలంటరీ తీసుకోటం బాగుంది. నీవు బావగారు చిలకా గోరింకల్లా అలా అలా సుఖంగా తిరిగిరండి. కాకపోతే, అక్కా ఓ వారం రోజులు నీకో డ్యూటీ వేస్తున్నా. ఇది డ్యూటీ కాదనుకో! మా పసివాణ్ణి వారం రోజులు నీ దగ్గర దింపుతా. నీవు కాదనవని తెలుసు. బావగారికి కూడా పసివాడంటే ప్రాణం, మనుమడితో ఆడుకున్నామనుకోండి. వివరాలతో మళ్ళీ రాస్త..."

రాధిక రాసిన ఉత్తరం మడిచి, మనవడిలా ఆడించాలట అంటూ భర్త రామం చేతిలో పెట్టింది, శాంతి.

రామం ఏం చెప్పాడో అదే జరుగుతుందే మిటీ! శాంత మనసులో ఆవేదన బయలుదేరింది. నీ మేలు కోరి చెప్తున్నా అని బతిమాలి చిన్నపిల్లకి చెప్పినట్టు నచ్చచెప్పాడు. అప్పుడే ఇదంతా పురుషాహంకారం, తనింట్లో కూచోవచ్చు కానీ, నేను కష్టపడాలా అని, ఎంత చెప్పినా భార్యంటే తనతో సమంగా గౌరవించే సంస్కారం ఎందరి కుంటుందిలే అని మహా అహంకారంగా ఆలోచించింది తనే. తనే ఈ గొయ్యి తవ్వకుంది. పడాలి కదా తప్పదు. తను కోరుకున్న విశ్రాంతి ఇదా. శాంతకి చాలా చిరాగ్గా వుంది.

రామం చేతిలో ఉత్తరం కదులుతోంది. భార్యవైపు జాలిగా చూసాడు.

అంతలో కాలింగ్‌బెల్ మోగింది.

'హలో బాబాయ్' జీన్సుపాంటు, పొట్టి షర్టు మరీ పొట్టి జుట్టు, అలేఖ్య లోపల కొచ్చింది. చిన్న సూట్‌కేసుతో.

రామం ముఖం వెలిగిపోయింది. తన అన్న కూతురు అలేఖ్య. ఎంతో తెలివైందని మహాఇష్టం బాబాయికి. బాబాయి అంటే అలేఖ్యకీ ఇష్టమే.

'బాబాయ్ - హైటెక్‌సిటీలో జాబ్ వచ్చింది. ఆ దగ్గరలో మా ఫ్రెండుతో కలసి ఉంటానంటే నాన్న అమ్మ ఒప్పుకోలేదు. అంది జుట్టుకున్న రబ్బరు బాండ్ సర్దుకుంటూ.

అయినా, నేనిక్కడ అలా జరగనిస్తానా హాయిగా ఉండు... పిన్న కూడా ఇప్పుడు ఫ్రీ. ఉద్యోగానికి పరిగెత్తే గొడవ లేదు. హాయిగా ఉద్యోగం చేసుకో, మంచి కుర్రాణ్ణి చూసి పెళ్ళి చేసేస్తా" ఆ మాట అనగానే సిగ్గుపడుతూ లోపలికి పరుగెత్తింది అలేఖ్య.

శాంత అంతా వింటూనే ఉంది.

"శాంతా అమ్మాయి వచ్చింది" అన్నాడు.

"హలో పిన్ని చూసావా ఎంత మార్పో నీలో. నువ్వు ఏ రోజయినా ఈ టైముకి ఇలా వున్నావా. బ్యూటిఫుల్ కాటన్ చీర, చెక్కు చెదరని కుచ్చెళ్ళు, మాచింగ్ వాచీ స్ట్రాప్, ఓహో, పిన్నీ, నువ్వంటే నాకెప్పుడూ భలే ఎడ్మిరేషన్, పోన్లే ఇవాళ మరీ బావున్నావ్, హాయిగా ఈ నలిగిపోయిన చీర, ఆ రంగు వేలసిన జాకెట్టు, ఓ చేత్తో ఉప్మా గరిట, అచ్చంగా, చక్కటి ఇల్లాలిలా - అయినా ఎంత కాలం చేస్తావులే ఉద్యోగం. ఎవడైనా ఐదేళ్ళు చేయండి చాలు, విశ్రాంతి అంటే ఎంత బావుంటుందో కదా పిన్నీ" అంటూ గలగలా మాట్లాడుతూ ప్లేట్లో ఉప్మా తింటుంది అలేఖ్య. "చట్నీ వేసుకో - పిన్ని చాలా బాగా చేస్తుంది" అని రామం శాంత పక్కనే కూచున్నాడు.

శాంత కళ్ళ ముందు బావగారి అమ్మాయి అలేఖ్య. నెల రోజులుండటానికి రోబోతున్న ఆడబిడ్డ, వారం రోజులు చూడాలి అంటూ తీసుకొస్తున్న చెల్లెలి ముద్దుల పసివాడు. ఓహో శాంతా! అద్భుతంగా వుంది. అవిశ్రాంత విశ్రాంతి. శాంత కళ్ళలో ఓ నీటి పొర అలా కదిలింది ఓ నిముషం.

అంతలో ఫోను మోగింది - అమెరికా నుంచి అబ్బాయి - ఏమంటాడూ!! ఇంటినిండా మనుషులూ - అంతా ఆత్మీయులు, వారి వారి అవసరాలకి ఆదుకోటంలో ఆనందం వుందిగా - నువ్వేనే దానివిగా నా ఉద్యోగం పుణ్యమా అని ఎవరికీ సాయం చేయలేను, డబ్బిస్తేచాలుతుందా - నాలుగురోజులు ప్రేమగా వండి పెట్టలేను, అని - - - ఇదోలా సాగింది సంభాషణ!!

శాంతకి అనిపించింది - తను ఇంట్లో వుండబట్టి కదా నలుగురికి ఉపయోగపడింది - ఇదీ ఉద్యోగమే!! మనిషి మనిషికి సాయం చేయటం కన్నా ఆనందం, తృప్తి ఏముందీ - శాంత లేచి ఫోన్ చేసింది స్నేహితురాలికి.

"లలితా, నాలుగు రోజుల నాడు నీకు చెప్పాగా... వి.ఆర్.ఎస్. వెనక్కి తేసేసుకుంటానని - అది జరుగదనుకో - అయినా నా మనసు మార్చుకున్నా - అందరికీ చెప్పేయ్" అంది తృప్తిగా.

"పిన్నీ" నాకు ప్రమోషన్ ఇది నీ చలవే" అంటూ శాంత కాళ్ళకి దణ్ణం పెట్టింది అలేఖ్య.

ఆ రాత్రి ఆడబిడ్డ భర్త వచ్చాడు. "మీ విశ్రాంతినంతా మేమంతా ఇలా వాడేసుకున్నందుకు క్షమించాలి. మీరు బాధ్యతగా చూసుకో బట్టే కదా మా రాణి, కోలుకుంది ఆమె భర్త శాంత పాదాలకి నమస్కరించారు.

పసివాడు శాంత ఒళ్ళో కూచుని కళ్ళ జోడు లాగుతున్నాడు!!

శాంత కళ్ళలో ఆనంద భాష్పాలు కదిలాయి. తనింటికందరూ వచ్చేస్తారని, తనే అందరికీ చాకిరీ చేయాలని ఆలోచించినందుకు చాలా పశ్చాత్తాప పడింది. ఈ ఆప్యాయతలే నా విశ్రాంతి అనుకుని హాయిగా నవ్వుతున్న శాంతని గుండెలకి హత్తుకున్నాడు భర్త రామం.

చేతన డిసెంబర్, 2006